క్లుప్తంగా

ఐసీయూలో పెన్షన్ అందజేత



వెంకట్రావుకు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ అన్వేష్

ఇంకొల్లు (చినగంజాం): ఐసీయూలో ఉన్న ఓ పేషంట్‌కు పెన్షన్ అందజేసి వలంటీర్ తన సేవా గుణాన్ని చాటుకున్నాడు. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళితే.. మండలంలోని నాగండ్ల గ్రామ సచివాలయం సూదివారి పాలెం గ్రామానికి చెందిన మానేపల్లి వెంకట్రావు అనారోగ్యరిత్యా గుంటూరులోని పీపుల్స్ ట్రామా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. సూదివారిపాలెం పంచాయతీ సచివాలయం పరిధిలోని క్లస్టర్ 14 వలంటీర్ పేరాల అన్వేష్ గుంటూరులో అనారోగ్య రిత్యా ఐసీయూలో చికిత్స తీసుకుంటున్న వెంకట్రావు వద్దకు వెళ్ళి పెన్షన్ అందజేశారు.

పోలింగ్ స్టేషన్‌ల తనిఖీ



బీఎల్ఓలకు సూచనలిస్తున్న తహసీల్దార్

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని పోలింగ్ స్టేషన్‌లను తహసీల్దార్ పి. బ్రహ్మయ్య ఆదివారం సందర్శించి తనిఖీ చేశారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు అనుసారం నవంబర్ 4,5 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ డేస్ సందర్భంగా నవంబర్ 5వ తేదీ ఇంకొల్లు పరిధిలోని పోలింగ్ స్టేషన్‌లు 238, 240,242,243 ఆయన సందర్శించారు. బీఎల్ఓలను ఫాం 6, ఫాం 7, ఫాం 8 ఎన్ని వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. ఇంకొల్లు మండలంలో మొత్తం 54 పోలింగ్ స్టేషన్‌లు ఉన్నాయని తెలిపారు. 4వ తేదీ ఫాం 6 ః14, ఫారం 7 ః 02, ఫారం 8 ః01 క్లైయిమ్స్.. 5వ తేదీ ఫాం 6 ః 15, ఫాం 7 ః 06 ఫాం 8 ః07 క్లైయిమ్స్ వచ్చాయని తహసీల్దార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన కుమార్

పర్చూరు(చినగంజాం): ద్విచక్రవాహనంపై వెళుతూ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయిన వ్యక్తి గాయాలపాలైన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. చీరాలకు చెందిన కుమార్ అనే వ్యక్తి పర్చూరు నుంచి చీరాల వెళ్ళే మార్గంలో స్వగ్రామానికి వెళుతూ ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వద్ద రోడ్డుపై వాహనం అదుపుతప్పి పడిపోయాడు. ప్రమాదంలో కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని తీవ్ర గాయాలపాలైన అతనిని 108 వాహనంలో గుంటూరుకు తరలించారు.

ప్రమాదంలో మహిళకు గాయాలు



పరిమి పేరమ్మ

బల్లికురవ: కారు టైరు పంక్చర్ అవటంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న మహిళ గాయాలపాలైంది. ఈ ఘటన ఆదివారం సాయంత్రం మేదరమెట్ల- నార్కెట్ పల్లి నామ్ రహదారిలోని మండలంలోని కొప్పరపాడు గ్రామ సమీపంలోని వినుకొండ క్రాస్ రోడ్డు వద్ద జరిగింది. మండలంలోని వెలమవారిపాలెం గ్రామానికి చెందిన పరిమి పేరమ్మ కారులో ఒంగోలు వెళ్లి తిరిగి స్వగ్రామం వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో బల్లికురవ నుంచి వచ్చిన 108 వాహనం ఈయంటి పిచ్చయ్య, పైలట్ శ్రీకాంత్ ప్రథమ చికిత్స తదుపరి పేరమ్మను ఉన్నత చికిత్సకు నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

చీరాల: చీరాల ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, నేరస్తులకు ఆదివారం సీఐ పి.శేషగిరిరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు చేపట్టవద్దన్నారు. ప్రతి ఒక్కరిపై నిఘా ఉంటుందని, ఎటువంటి నేరాలకు పాల్పడవద్దన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ వెంట ఎస్సై అహ్మద్ జానీ, సిబ్బంది ఉన్నారు.

వర్షం కోసం పోలేరమ్మకు పూజలు



కారంచేడు: ప్రత్యేకాలంకరణలో గ్రామదేవత గంగమ్మతల్లి



చినగంజాం: జలస్నానం చేయిస్తున్న రైతులు, మహిళా భక్తులు



నూతలపాడులో పొంగళ్ళు పెడుతున్న మహిళా భక్తులు

పర్చూరు (చినగంజాం): వరుణదేవుడు కరుణించి వర్షాలు కురిసేలా చేయాలని భక్తులు పోలేరమ్మ అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం నూతలపాడులో వేంచేసియున్న శ్రీ పోలేరమ్మ అమ్మవారికి మహిళా భక్తులు పెద్ద ఎత్తున మొక్కులు మొక్కుకున్నారు. మేళతాళాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వర్షాలు పడి గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు చేశారు. ఆలయ ప్రాంగణంలోనే పొంగళ్ళు పెట్టి అమ్మవారికి సమర్పించారు.

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు గ్రామ దేవత గంగమ్మతల్లికి ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వాతావరణ పరిస్థితుల్లో వర్షలు లేక పంటలు ఎండు దశకు రావడంతో గంగమ్మ తల్లికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి తలంటు స్నానాలు ఆచరించారు. పంటలు బాగా పండాలని, గ్రామంలో ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలని గ్రామస్తులు పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బల్లికురవ: వర్షాలు కురవాలని పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని ఆదివారం మండలంలోని కొప్పరపాడులో గ్రామ దేవత పోలేరమ్మ ఆలయం వద్ద పొంగళ్ల పెట్టి అమ్మవారికి నివేదించారు. వరుణుడి కరుణ కోసం శుక్ర, శని వారాల్లో గ్రామ దేవతలైన పోలేరమ్మ గంగమ్మ, నాభిశిలకు 101 బిందెలతో జలాభిషేకం చేశారు. తాము చేసిన పూజలు ఫలించి రెండు రోజులుగా చిరుజల్లులు కురుస్తున్నాయని ఈ జల్లుతో ఖరీఫ్‌లో సాగుచేసిన మెట్ల పైర్లు అవి పోసుకుని కళకళలాడుతున్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

చినగంజాం: అన్నదాతలు తమ పంటలకు వర్షం కురవాలంటూ పోలేరమ్మ అమ్మవారికి జల స్నానం చేయించారు. మండలంలోని సోపిరాల గ్రామానికి చెందిన అన్నదాతలు తమ పంటలకు సకాలంలో వర్షాలు లేక పోవడంతో ఆదివారం గ్రామంలోని రైతులు, మహిళలు బిందెలతో నీటిని తీసుకొని గ్రామంలో ఊరేగింపుగా పొలిమెరలో ఉన్న పోలేరమ్మ ఆలయంలో జలస్నానం చేయించి తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు.

హామీలు నెరవేర్చిన సీఎం జగనన్న



ప్రభుత్వ పథకాల లబ్ధి వివరిస్తున్న చైతన్య

అద్దంకి రూరల్: ప్రజా సంకల్పయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని రాష్ట్ర కాపునెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం మండలంలోని కుంకుపాడులో నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. టీడీపీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా, మేనిఫెస్టోను వెబ్‌సైట్‌లో నుంచి తొలగించిందన్నారు. జగనన్న మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించారన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ జగనన్న పాలనలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. ఇచ్చిన మాటపై వచ్చే జనవరి నుంచి అవ్వాతాతలకు రూ. 3 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థతో అవినీతి తావులేకుండా పారదర్శక పాలన చేస్తున్నారని తెలిపారు. ఏ రాష్ట్రంలోనూ ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని ఇతర రాష్ట్రాల సీఎంలు సైతం జగనన్న పాలనను ఆదర్శంగా తీసుకుంటున్నారన్నారు.

ప్రతిపక్షాలైన టీడీపీ, జనసేన ఎన్ని కుట్రలు పన్నిన ప్రజా సంక్షేమం కోసం శ్రమించే జగనన్నను మరలా ముఖ్యమంత్రిగా చేయాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని చైతన్య అన్నారు. పార్టీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, ఎంపీపీ అవిశెన జ్యోతి, మండల పార్టీ అధ్యక్షుడు గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, స్థానిక నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

15న చలో విజయవాడ

దొనకొండ: ఈ నెల 15న ప్రజా రక్షణ భేరి ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల సీపీఐ కార్యదర్శి చిరుపల్లి అంజయ్య కోరారు. స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో ఆదివారం ఛలో విజయవాడ కరపత్రాలను పంపిణీ చేశారు. బీజేపీ పాలనలో రాష్ట్రాల హక్కులను హరిస్తూ ఏకపక్షంగా నిర్ణయాలు రుద్దుతుందని, సామాజిక న్యాయాన్ని తూట్లు పొడుస్తుందన్నారు. పలు సమస్యల గురించి సీపీఎం ఆధ్వర్యంలో 15న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, గ్రామాల్లోని ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కుందుర్తి అనిల్, సంతోష్‌కుమార్, కిరణ్‌బాబు, శ్రీకాంత్, జాన్‌బాబు, పెద్దముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయానికి అనుమతి తప్పనిసరి

తర్లుపాడు: దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా దుకాణాల నిర్వాహకులు పోలీసు శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని తర్లుపాడు ఎస్సై వేముల సుధాకర్ స్పష్టం చేశారు. తయారీదారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. బాణసంచా, పేలుడు పదార్థాలు ఇంటిలో నిల్వ ఉంచరాదని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేసుకుని విక్రయించాలని చెప్పారు. ప్రమాదాల బారి నుంచి రక్షణకు దుకాణాల వద్ద నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల వద్ద కోటా సత్యమాంబదేవి ఆలయం, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ దేవస్థానాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమ పూజలు చేసి అఖండ హారతి ఇచ్చారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

ప్రకృతి పరిరక్షణకు చెట్లు ప్రధానం

● జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ జేడీ పీఎస్ రెడ్డి



నర్సరీలో వర్మి వాష్ (లిక్విడ్) యూనిట్ పరిశీలిస్తున్న అధికారులు

వేటపాలెం: ప్రకృతి పరిరక్షణకు చెట్లు ప్రధాన పాత్ర పోషిస్తాయని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ జాయింట్ డైరెక్టర్ పీఎస్ రెడ్డి పేర్కొన్నారు. బాపట్ల జిల్లా వేటపాలెం మండలం అక్కాయిపాలెం పంచాయతీ లక్ష్మీపురంలోని ప్రొటెక్ట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని జిల్లా అధికారులు ఆదివారం సందర్శించారు. రాష్ట్ర పర్యటక శాఖ హెచ్‌ఆర్ మేనేజర్ సుహాసిని రెడ్డి, జిల్లా అటవీ అధికారి అరుణ నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విపత్తుల సమయంలో నేల కోతను అరికట్టగలిగేది చెట్టు ప్రధాన పాత్ర పోషిస్తాయని తెలిపారు. కాలుష్యాన్ని నియంత్రించే మొక్కల్లో మారేడు ముఖ్యమన్నారు. ఆ సక్తి గల వారికి మొక్కలు ఉచితంగా అందచేస్తామని తెలియజేశారు. శవనం చంద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మ ప్రచార వారోత్సవాల్లో ప్రత్యేక పూజలు



ఆకుపూజలు నిర్వహిస్తున్న భక్తులు

అద్దంకి : ధర్మ ప్రచార వారోత్సవాలు ఆరో రోజు శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం నుంచి ప్రచార రథం ఆదివారం అద్దంకి పట్టణంలోని మాధవస్వామి దేవస్థానానికి చేరింది. భక్తులు ఉదయం 8 గంటల నుంచి సింధూరంతో సహస్రనామార్చన, సామూహిక కుంకుమ పూజలు, నిర్వహించారు. అనంతరం బీవీఎస్ సత్యనారాయణ ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. స్వామివారి ప్రచార రథంతో వీధుల్లో తిరుగుతూ ధర్మ బోధనలు వివరించారు. ఈవో కోటిరెడ్డి, శింగరకొండ దేవస్థానం అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా రక్షణభేరి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

గిద్దలూరు రూరల్: సీపీఎం ఆధ్వర్యంలో విజయవాడలో ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న ప్రజా రక్షణభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.సోమయ్య కోరారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం బహిరంగ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆవులయ్య, పూర్ణ, నరసింహులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో గృహాలు ప్రారంభం



గృహాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని మాదాలవారిపాలెంలో జగనన్న కాలనీలో గృహాలను ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి ప్రారంభించారు. పూజల అనంతరం గృహ ప్రవేశ కార్యక్రమాలు పండగ వాతావరణంలో సాగాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఉడుముల మాట్లాడుతూ.. ఇళ్లు కాదు, ఊళ్లు నిర్మిస్తామని చెప్పిన మాటను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపిస్తున్నారని పేర్కొన్నారు. పక్కా ఇళ్లు సొంతం చేసుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, ఎంపీపీలు వాకా వెంకటరెడ్డి, మోరబోయిన మురళి, సొసైటీ అధ్యక్షులు అనికాళ్ల ఈశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ పెమ్మని ఓంకార్, కొనకనమిట్ల సచివాలయాల కన్వీనర్ ఎస్.పెద్ద వెంకటరెడ్డి, కన్వీనర్లు డి.శ్రీనివాసరెడ్డి, మోరా శంకరరెడ్డి, గుంటూరు పిచ్చిరెడ్డి, వెండిదండి వెంకటేశ్వరరెడ్డి, చిమటా నరసారెడ్డి పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి పూజలు



గంగమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పెద్దదోర్నాల: సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ మండల పరిధిలోని చిన్న గుడిపాడులో గంగమ్మ తల్లికి భక్తులు ఆదివారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వర్షాలు బాగా పడాలని, పాడి పంటలు అభివృద్ధి చెందాలని గంగమ్మ తల్లికి నైవేద్యాన్ని సమర్పించి జలాభిషేకం నిర్వహించారు. అనంతరం గంగమ్మ తల్లిని గ్రామంలోని వీధుల్లో కొమ్ము బూరాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వీధుల్లో మహిళలు వారు పోసి ఊరేగింపునకు స్వాగతం పలికి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామ సమీపంలోని చెరువుకట్ట వద్దకు చేరుకుని గంగమ్మ తల్లికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం చేశారు. కార్యక్రమాలను గ్రామ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

బైక్, ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు

గిద్దలూరు రూరల్: బైక్, ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని బురుజుపల్లె గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. బురుజుపల్లె గ్రామం నుంచి మహిళా కూలీలతో వస్తున్న లగేజీ ఆటోను ముండ్లపాడు గ్రామానికి చెందిన శిరిగిరి తేజ అనే వ్యక్తి బైక్‌పై వెళ్తూ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శిరిగిరి తేజ, లగేజీ ఆటోలో ప్రయాణిస్తున్న శింగంపల్లెకు చెందిన మహిళకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

అనాథ మహిళకు ఆర్థిక సహాయం

పెద్దదోర్నాల: మండల కేంద్రానికి చెందిన నిరుపేద అనాథ మహిళకు మైనారిటీ హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ముంతాజ్ అనే నిరుపేద మహిళకు గ్రైండర్, కుట్టుమిషన్‌లతో పాటు బియ్యం, నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ బాబు, ఉపాధ్యక్షుడు అబ్దుల్ సమద్, సెక్రటరీ ఖాసిం, జాయింట్ సెక్రటరీ మహబూబ్‌బాషా, ట్రెజరర్ వాజిద్ పాల్గొన్నారు.

భూ సమస్యపై ఇరువర్గాల వాగ్వాదం



పోలీస్ స్టేషన్‌లో ఫ్లాట్‌ల యజమానులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసరావు

మార్టూరు: జాతీయ రహదారి తూర్పు వైపున గల సర్వే నంబర్ 603/సీ భూ సమస్యపై ఆదివారం ఇరువర్గాల మధ్య మరో సారి వివాదం తలెత్తింది. బాధితులు, ఎస్ఐ ఎం. శ్రీనివాసరావు వివరాలు ఇలా ఉన్నాయి. 603/సీ సర్వే నంబర్‌లోని 79 సెంట్ల భూమిలో 20 ఏళ్ల క్రితం సుమారు 15 మంది గృహ నిర్మాణాల కోసం ఫ్లాట్‌లు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకొని కొందరు గృహనిర్మాణాలు సైతం చేసుకున్నారు. ఈ క్రమంలో గత రెండు రోజుల నుంచి కొందరు స్థానికులు ఆ భూమి తమ పూర్వీకులకు చెందిన చాకలి మాన్యానికి సంబంధించినది అని తమకు అన్ని హక్కులు ఉన్నాయంటూ వారు ఆ భూములలోని చెట్టు నరికి శుభ్రం చేయసాగారు. ఫ్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు రెండు దశాబ్దాలు క్రితం తాము కొనుగోలు చేసుకున్న ఫ్లాట్లపై మీ దౌర్జన్యం ఏమిటంటూ ఆదివారం భూమిపైకి ఇరువర్గాలు వెళ్ళడంతో కొంత సేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలిసిన ఎస్ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలికి చేరుకొని పరిస్థితి సమీక్షించి ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించి భూ సమస్యపై పూర్వపరాలు పరిశీలించారు. సర్వే 603/సీ లోని భూమిపై 145 సెక్షన్ గత సంవత్సరం నుంచి అమల్లో ఉందని, వివాదం పరిష్కారమై ఆ సెక్షన్ తొలిగించేంత వరకు ఇరువర్గాల వారు భూమిపైకి వెళ్ళరాదని అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటానని హెచ్చరించడంతో సమస్య సద్దుమణిగింది.

ఓటు నమోదుకు అవకాశం ఇవ్వాలి



బూత్ లెవెల్ అధికారులకు సూచనలిస్తున్న తహసీల్దార్ పార్వతి



కొప్పరపాడులో ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్

చినగంజాం: పోలింగ్ బూత్‌ల వద్ద బూత్ లెవెల్ ఆఫీసర్‌లు అందుబాటులో ఉండి ఓటు నమోదు చేయాలని తహసీల్దార్ పి. పార్వతి అన్నారు. ఓటు నమోదు కోసం ప్రత్యేకంగా చేపట్టిన ఓటు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆమె మండలంలోని పోలింగ్ స్టేషన్‌లను సందర్శించారు. శని, ఆది వారాలలో ఓటు నమోదుకు ప్రత్యేక రోజులుగా కేటాయించడంతో ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉండి ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలింగ్ బూత్‌లకు విచ్చేసిన తహసీల్దార్ బూత్ లెవెల్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఆఫ్‌లైన్ ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని వారికి సూచించారు. డీటీ శ్రీకాంత్, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించండి

బల్లికురవ: అర్హులందరికీ పారదర్శకంగా ఓటు హక్కు కల్పించాలని తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ కె. రవిబాబు, కె. రవికుమార్ కోరారు. ఓటరుగా నమోదుకు ప్రభుత్వం చేపట్టిన క్యాంపెయిన్‌లో భాగంగా ఆదివారం కొప్పరపాడు, బొల్లాపల్లి గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను తనిఖీ చేశారు. ప్రత్యేక శిబిరాల ద్వారా శని, ఆదివారాల్లో చేర్పులకు 93, తొలగింపులకు 42 పోలింగ్ బూత్ మార్పుకు 69 దరఖాస్తులు అందినట్లు చెప్పారు. డిసెంబర్ 2,3 తేదీల్లో కూడా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని డిసెంబర్ 9 వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తామని జనవరి 5న తుది జాబితాను వెల్లడిస్తామని తహసీల్దార్ వెల్లడించారు.

చెక్‌డ్యాంకు తాత్కాలిక మరమ్మతులు



జేవీపాలెం వద్ద చెక్‌డ్యాంకు క్రేన్ ద్వారా మట్టి కట్ట వేస్తున్న దృశ్యం

జరుబులవారిపాలెం (కారంచేడు): మండలంలోని జరుబులవారిపాలెం, హనుమోజీపాలెం, నాయుడువారిపాలెం గ్రామాల రైతులకు కొన్ని వందల ఎకరాలకు అవసరమైన సాగునీటిని అందించే వాగులో చెక్‌డ్యాంకు మరమ్మతులు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మాదాసు కుమారి తెలిపిన వివరాల ప్రకారం వాగులో ఉండే చెక్‌డ్యాం గతంలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో కొంత మేర కొట్టుకు పోవడంతో సాగునీటికి అడ్డుకట్ట వేయడానికి వీలు లేకుండా పోతోందని, దీని ద్వారా సాగునీటిని నిల్వ చేసుకొనే సామర్థ్యం లేక ఈ ప్రాంత రైతులు అనేక విధాలుగా నష్టపోతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్‌కు తెలియజేశామన్నారు. అలాగే ఎంపీపీ నీరుకట్టు వాసుబాబుకు కూడా సమస్యను తీసుకురాగా వారిద్దరి సూచనలతో క్రేన్ సహకారంతో చెక్‌డ్యాం వద్ద 30 మీటర్ల పొడవు, 8మీటర్ల వెడల్పుతో మట్టి ద్వారా కట్ట ఏర్పాటు చేశామని చెప్పారు.

సేవా దృక్పథంతో వైద్యాన్ని అందించాలి



స్మార్ట్ ఐసీయూను ప్రారంభిస్తున్న క్రికెటర్ అంబటి తిరుపతిరాయుడు

చీరాల: వైద్యాన్ని వృత్తిలా కాకుండా సేవా దృక్పథంతో పేద వర్గాల ప్రజలకు అందించి నాణ్యమైన వైద్యం అందించాలని భారత క్రికెటర్ అంబటి తిరుపతిరాయుడు అన్నారు. ఆదివారం చీరాల్లోని లైఫ్ హాస్పిటల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్మార్ట్ ఐసీయూ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వైద్యాన్ని సేవగా భావించి చీరాల, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. క్రికెటర్ అంబటి తిరుపతిరాయుడును చూసేందుకు క్రికెట్ అభిమానులు అధిక సంఖ్యలో హాజరై సెల్ఫీలు, ఆటోగ్రాఫ్‌లు తీసుకున్నారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.అవంతి (మేజర్), డాక్టర్ సజ్జా రవీంద్రబాబు, డాక్టర్లు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

రాచర్ల: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని రాచర్ల ఫాం గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. అనుములపల్లె గ్రామానికి చెందిన బి.రంగనాయకులు అనే వ్యక్తి తన బైకుపై గిద్దలూరు నుంచి అనుములపల్లె గ్రామానికి వస్తున్నాడు. అదే సమయంలో గిద్దలూరుకు బైకుపై వెళ్తున్న గుర్తుతెలియని మరో వ్యక్తి రాచర్ల ఫాం గ్రామ సమీపంలో ఎదురెదురుగా ఢీకొనడంతో రంగనాయకులు తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో గిద్దలూరు ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తీసుకెళ్లారు. సంఘటన స్థలాన్ని ఏఎస్సై ఆదిశేషయ్య పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.